క్లుప్తంగా

దూరవిద్య విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

కొత్తవలస: మండల కేంద్రంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఆంధ్రా యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిస్టెన్స్, ఎడ్యుకేషన్ (దూరవిద్య) అకడమిక్ ఇయర్, క్యాలెండర్ ఇయర్ అడ్మిషన్స్ తీసుకున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.ఇ.కుమార్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, ద్వితీయ, తృతీయ సంవత్సరాలకు చెందిన బీఏ, బీకాం కోర్సులకు సంబంధించిన విద్యార్థులకు ఈ నెల 18,19,25,26 తేదీల్లో, వచ్చేనెల 1,2,8,9,15,16 తేదీల్లోను వారాంతరపు తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 95501 31930, 79899 83228 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఒమ్మి విద్యార్థి ప్రతిభ


అంబళ్ల కార్తికేయ నాయుడు

నెల్లిమర్ల రూరల్: మహాత్మా గాంధీ జ్యోతి రావు పూలే రెసిడెన్షియల్ పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షల్లో మండలంలోని ఒమ్మి గ్రామానికి చెందిన అంబళ్ల కార్తికేయనాయుడు సత్తా చాటాడు. 50 మార్కులకు గాను 50 మార్కులు సాధించి జిల్లాలో రెండో ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా కార్తికేయనాయుడును తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

25న సత్యనారాయణ స్వామి వార్షిక కల్యాణం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేట సత్యనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 25న ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా వార్షిక కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కొండేటి సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నెల్లిమర్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.రామారావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఎంపీపీ అంబళ్ల సుధారాణి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు, తదితర అంశాలపై మండల స్థాయి అధికారులతో సమీక్షిస్తామన్నారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

విజయనగరం అర్బన్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి ఉచిత శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ కార్యదర్శి బి. లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థులకు చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లిష్, తెలుగు, గణితం, పేపర్ క్రాఫ్ట్, పుస్తక పఠనం, కథలు చెప్పడం, చదివించడం, పుస్తక సమీక్ష, డ్రామా, కవితలు, కంప్యూటర్ శిక్షణ, సంగీతం, డ్యాన్స్, భగవద్గీత శ్లోకాలు, చదరంగం, క్యారమ్స్, యోగా వంటి అంశాల్లో స్థానిక గురజాడ స్మారక కేంద్ర గ్రంథాలయ భవనంలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 79950 12482, 80080 23401 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ముగిసిన వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరం

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో వారధి కార్యక్రమంలో భాగంగా మూడు రోజులు నిర్వహించిన వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరం శుక్రవారంతో విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా రామాయణంలో పాత్రలు, విలువలు, వాటిని ఆచరించడంపై రచయిత శ్రీరా మ చక్రధర్, జాహ్నవి రెడ్డి, శారద దీప్తి అవగాహన కల్పించారు. అనంతరం రామాయణంపై విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు అందజేశారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు

విజయనగరం అర్బన్: ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో జాప్యం తగదని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు అన్నారు. ఎన్నిల నిర్వహణలో ఎదుర్కొన్న వివిధ సమస్యలను రెండు రోజుల కిందట జిల్లా అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు డీఆర్‌ఓ ఎస్‌డీ అనితను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మూడు రోజులు విధులు నిర్వహించినప్పటికీ రెండురోజులకు రెమ్యూనిరేషన్ ఇచ్చారని ఆరోపించారు. మిగిలిన రోజుకు సంబంధించిన రెమ్యూనిరేషన్‌తో పాటు ట్రైనింగ్ రోజును కలిపి డ్యూటీ సర్టిఫికెట్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వ్‌లో ఉన్న ఉద్యోగులకు కూడా డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. డీఆర్‌ఓను కలిసిన వారిలో జేఏపీఈ రోకే ఈశ్వరరావు, డి.శ్యామ్, ఈ.రామునాయుడు, కేవీ రమణ, ఏవీ శ్రీనివాసరావు, వై.అప్పారావు, రాంప్రసాద్, కిరణ్‌కుమార్, ఏజీ తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


జామి: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బంది


గంట్యాడ: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది


గజపతినగరం రూరల్: మరుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



బొండపల్లి: బొండపల్లిలో ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

గంట్యాడ: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బి.హేమలత అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీవన శైలిలో మార్పుల వల్ల ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా బీపీ, సుగర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. ఆరోగ్య జాగ్రత్తలు పాటించడం ద్వారా బీపీ, సుగర్ వ్యాధులను నియంత్రణలో ఉంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎర్రన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పు, కారం తగ్గిస్తే.. రక్తపోటు దూరం

గజపతినగరం రూరల్: నలభై ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించినట్లయితే రక్తపోటు దరిచేరకుండా ఉంటుందని మరుపల్లి ప్రాథమిక ఆస్పత్రి వైద్యుడు అనూజ్‌కుమార్ రాయ్ అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నిత్యం మనం తీసుకునే ఆహారంలో ఉప్పు, కారంను తగ్గించుకుంటే రక్తపోటు దరిచేరదన్నారు. అలాగే మద్యం, మాంసాహారానికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రతిరోజు యోగా, ధ్యానం, వ్యాయామం చేసినట్లయితే రక్తపోటు ధరిచేరదన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సరైన జీవన శైలితోనే ఆరోగ్యం

జామి: ఆహార అలవాట్లు, జీవనశైలితో మార్పులతో రక్తపోటును అధిగమించవచ్చని జామి పీహెచ్‌సీ వైద్యాధికారి సామ్రాజ్యలక్ష్మి అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో శుక్రవారం వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిరోజు అరగంట వ్యాయమం చేయడం, ఉప్పు వాడకాన్ని తగ్గించడం వలన అధిక రక్తపోటు బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోచ్చన్నారు. 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో రక్తపోటు పరీక్షలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్.నాగశ్వేత, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జీవనశైలితోనే రక్తపోటుకు స్వస్తి

బొండపల్లి: నలభై ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో తగిన మార్పులు చేసుకోవాలని, మితాహారాన్ని అలవాటు చేసుకుంటే రక్తపోటు ధరిచేరకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని బొండపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు జి.సమీరా అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా రోజు వ్యాయామం, యోగా, ధ్యానం వంటివి చేసినట్లయితే రక్తపోటు ధరిచేరదన్నారు. రక్తపోటు నియంత్రణ చర్యలపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజగోపాల్, సూపర్‌వైజర్ ఎస్ఏ భాషా, సీహెచ్‌ఎస్ రోజారమణి, సీనియర్ అసిస్టెంట్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉద్యోగావకాశాలు


నియామక పత్రాలు పొందిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది

చీపురుపల్లి రూరల్: పాలిటెక్నిక్ విద్యతో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని జీబీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎల్.విజయలక్ష్మి అన్నారు. పాలిటెక్నిక్ విద్యను పూర్తి చేసి వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు పొందిన విద్యార్థులకు కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎలక్ట్రికల్, మెకానికల్ విద్యను చదువుతున్న 85 శాతం మంది విద్యార్థులు పలు కంపెనీల్లో ఉద్యోగాలు పొందారని తెలిపారు. వీల్స్ ఇండియా కంపెనీలో 17 మంది, ఎఫ్ ట్రానిక్స్ కంపెనీలో 14 మంది, ఎయిమ్ అండ్ ఎస్ఎస్ కంపెనీలో ఇద్దరు, డైకిన్ కంపెనీలో 18 మందికి, మేదాసర్వ్‌లో ముగ్గురు, కోకో–కోలాలో కంపెనీలో ఒకరికి ఉద్యోగాలు లభించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్‌కో ఏఈ బి.భీమేశ్వర్, వివిధ విభాగాల అధిపతులు చంద్రమౌళి, స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు


రైతులకు రాయితీపై విత్తనాలు అందచేస్తున్న ఏఓ

దత్తిరాజేరు: భూసారాన్ని పెంచడానికి ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న కంపోస్ట్ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ అనురాధ అన్నారు. దత్తిరాజేరు ఆర్బీకే వద్ద రైతులకు 50 శాతం రాయితీపై కట్టెజనుము, జీలుగు విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. భూసారం పెరగాలంటే వేసవి దుక్కుల అనంతరం పచ్చిరొట్ట పంటలైన కట్టెజనుము, పిల్లపెసర, జీలుగు వంటి పంటలను సాగు చేయాలని సూచించారు.


జామి: ఆర్‌బీకేలో అందుబాటులో ఉన్న పచ్చిరొట్ట విత్తనాలు

జామి: రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్నట్లు వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్ అన్నారు. జీలుగు, కట్టెజనుమ విత్తనాలు 10 కేజీల ప్యాకెట్ ధర రూ.880 కాగా, రాయితీపై రూ.440కి, పిల్లిపెసర 8 కిలోల ప్యాకెట్ ధర రూ.1072లు కాగా, రాయితీపై రూ.536కు అందిస్తున్నట్లు చెప్పారు. మండలానికి 90 క్వింటాళ్ల జీలుగు, 75 క్వింటాళ్ల కట్టెజనుము, 3 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు వచ్చాయన్నారు. కావాల్సిన రైతులు రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతం అవుతుందని, ఫలితంగా ఎరువుల వినియోగం తగ్గడంతో పాటు పంట దిగుబడులు పెరుగుతుందన్నారు.

అందుబాటులోకి అన్ని రకాల పిటీషన్లు


ఉచిత పిటిషన్స్ స్టాల్‌ను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి ఎస్.వాణి

శృంగవరపుకోట: న్యాయవాదుల ప్రాక్టీసుకు అవసరమైన అన్ని రకాల క్రిమినల్, సివిల్ పిటీషన్లు ఉచితంగా అందించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిదేముడు తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత పిటీషన్ల స్టాల్‌ను జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. కోర్టులో సీనియర్ న్యాయవాదులు చేసే వాదనలు, ప్రొసీడింగ్స్‌ను జూనియర్ న్యాయవాదులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సివిల్, క్రిమినల్ కేసులు వేసేటప్పుడు చట్టాలకు సంబంధించిన పుస్తకాలు చదవటం, వాజ్మాల తయారీ, వంటి అంశాల్లో సీనియర్ న్యాయవాదులను అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో సెకెండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ జి.అప్పలనాయుడు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎం.అప్పారావు, మీడియా సెక్రటరీ డబ్ల్యూ.ఎస్.శర్మ, లైబ్రరీ సెక్రటరీ ఆర్.సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ ఎల్.అప్పారావు, ట్రెజరర్ బి.త్రిమూర్తులు, సీనియర్ న్యాయవాదులు ఎ.సత్యాజీ, గేదెల ప్రకాశ్, వి.ఈశ్వరరావు, టి.వి.ఆర్.మూర్తి, బి.రామకృష్ణ, ఎం.అనూరాధ, బి.వెంకటరావు, జి.చిట్టిబాబు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

165 మందికి అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్


కొండవెలగాడలో వృద్ధుడికి బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ పీహెచ్‌సీ పరిధిలోని అన్ని వెల్‌నెస్ కేంద్రాల్లో బీసీజీ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని పీహెచ్‌సీ వైద్యాధికారి శిరీష తెలిపారు. ఈ మేరకు వెలగాడ పీహెచ్‌సీ పరిధిలోని పలువురికి అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ శుక్రవారం వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మొత్తం 165 మందికి అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేశామన్నారు. ఇప్పటికే టీబీ వచ్చి తగ్గిన వారు, సుగర్ పేషెంట్లు, 60 సంవత్సరాల వయస్సు దాటిన వృద్ధులు వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ ఆరోగ్య కార్యదర్శి మాధవి, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రగతి'బాట'లో కోడూరు


వాల్లేపేటలో నిర్మించిన సిమ్మెంటు రోడ్డు


కోడూరులోని ఓ వీధిలో నిర్మించిన సీసీరోడ్డు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కోడూరు పంచాయతీలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పరుగులు తీస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయి. దీంతో పాటు కోట్లాది రూపాయలతో ప్రభుత్వ భవనాలైన గ్రామ సచివాలయం, ఆర్‌బీకేల, వెల్‌నెస్ కేంద్రం, తదితర వాటిని నిర్మించారు. అలాగే కోడూరుతో పాటు పంచాయతీ పరిధిలోని వాల్లేపేటలో రూ.41 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమైందని స్థానిక సర్పంచ్ గేదెల కృష్ణవేణి, వైస్ సర్పంచ్ గేదెల శంకరరావు, స్థానిక నాయకులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

శతశాతం వసూలయ్యేనా..!

- పన్నుల వసూళ్లకు ఎన్నికల ఎఫెక్ట్
- 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో తగ్గిన వసూళ్ల శాతం


నగరంలోని భవన సముదాయాలు


తాగునీటి కుళాయి వద్ద నీరు పడుతున్న మహిళలు

విజయనగరం: స్థానిక సంస్థలకు పన్నుల రూపంలో వచ్చే ఆదాయం ఎంతో కీలకం. నగర అభివృద్ధికి ఈ నిధులు సమకూర్చుకోవడం తప్పనిసరి. ప్రతి ఏడాదీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రూపాల్లో నిధులు మంజూరు చేస్తున్నా... స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఖజానాను నింపుకోవడం కీలకమనే చెప్పాలి. అలా ఆదాయాన్ని సమకూర్చుకున్నప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని అధికారులు చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గడిచిన 58 నెలల కాలంలో నగరంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ద్వారా నగర రూపురేఖలు మారాయి. కార్పొరేషన్ హోదా దక్కించుకున్న నగరంలో అదే స్థాయిలో సుందరీకరణ, జంక్షన్‌ల అభివృద్ధి, ప్రధాన రహదారుల విస్తరణ, డివిజన్‌ల పరిధిలో రోడ్లు, కాలువల నిర్మాణాలు, తదితర అభివృద్ధి పనులు గతంలో ఎన్నడూ లేనివిధంగా జరిగాయని చెప్పడంలో సందేహం లేదు. 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో ఎన్నికల హడావిడి నేపథ్యంలో పన్నుల వసూళ్లు ఆశించిన స్థాయిలో వసూలు కాలేదనే చెప్పాలి.

కార్పొరేషన్ పరిధిలో ఇదీ పరిస్థితి..

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 69,511 అసెస్‌మెంట్‌లు ఉండగా... వాటి ద్వారా ఆస్తి పన్ను రూపంలో 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో రూ.26.11 కోట్ల ఆదాయం పన్నుల రూపంలో రావాల్సి ఉండగా... రూ.23.30 కోట్లు వసూలు చేశారు. రూ.2.82 కోట్ల బకాయిలు మిగిలిపోయాయి. అదేవిధంగా గడిచిన ఆర్థిక సంవత్సరాల్లో వసూలు కాని మొండి బకాయిలు రూ.14.67 కోట్లు ఉండగా... కేవలం రూ.5.66 కోట్లు వసూలు చేశారు. మరో రూ.9 కోట్లు వసూలు కావాల్సి ఉంది. మొత్తంగా 71 శాతం ఆస్తి పన్నులు వసూలు చేయగలిగారు. అదేవిధంగా ఖాళీ స్థలాలకు సంబంధించి 2708 అసెస్‌మెంట్‌లు అధికారిక లెక్కల ప్రకారం ఉండగా... వాటి ద్వారా గడిచిన ఆర్థిక సంవత్సరంతో పాటు అంతకుముందు బకాయిలు మొత్తం రూ. 8.72 కోట్లు కార్పొరేషన్ ఖజానాకు రావాల్సి ఉండగా.. ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి రూ. 5.11 కోట్లు వసూలు చేయగలిగారు. మరో రూ.3.60 కోట్ల బకాయిలున్నాయి. అలాగే తాగునీటి పన్నులకు సంబంధించి 24,770 అసెస్‌మెంట్‌లు ఉండగా... ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1.76 కోట్ల డిమాండ్ ఉండగా... రూ.0.88 కోట్లు వసూలు చేశారు. ఇంకా రూ.0.88 కోట్లు వసూలు కావాల్సి ఉంది. అదేవిధంగా గడిచిన ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన బకాయిలు మొత్తం రూ.3.99 కోట్లు ఉండగా... 40 లక్షల రూపాయలు మాత్రమే వసూలు చేయగలిగారు.

మొండి బకాయిలపై దృష్టి సారించేనా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారంభించిన సచివాలయ వ్యవస్థ ద్వారా పన్నుల వసూళ్లు మెరుగుపడ్డాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఆశించిన స్థాయిలో పన్నులు వసూలు జరిగినప్పటికీ 2023 – 24 ఆర్థిక సంవత్సరంతో పాటు గడిచిన ఆర్థిక సంవత్సరాల్లో పేరుకుపోయిన మొండి బకాయిల వసూళ్లలో యంత్రాంగం విఫలమవుతోంది. దీంతో ఆస్తి, నీటి పన్నులతో పాటు ఖాళీ స్థలాల నుంచి వసూలు కావాల్సిన మొత్తం కోట్ల రూపాయల్లో బకాయిలు ఉన్నట్లు అధికారిక లెక్కల వెల్లడిస్తున్నాయి. పేరుకుపోయిన బకాయిలు రాబడితే నగరంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఆస్కారం ఉంటుంది.

వైభవంగా సహస్ర దీపాలంకరణ


స్వామివారికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన పూజలు నిర్వహించిన తర్వాత యాగశాలలో నిత్య హోమాలు, వెండి మంటపం వద్ద స్వామి వారి కల్యాణం చేపట్టారు. సాయంత్రం 6 గంటలకు సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మంటపంపైకి తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆశీనులు చేశారు. అనంతరం దీపాలు వెలిగించి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.